క్లుప్తంగా

అరకొరగా పాఠ్య పుస్తకాలు

ఏలేశ్వరం: వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి మరో 13 రోజులు ఉండగా ఇప్పటివరకు అరకొరగా ప్రభుత్వ పాఠశాలల మెటీరియల్స్ మండలానికి చేరుకున్నాయి. స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో వీటిని భద్రపరిచారు. మండలానికి టెక్స్ట్ బుక్స్ 22,965 రాగా 22,897 బుక్స్, నోట్‌బుక్స్ 37,247 రాగా 20వేలు బుక్స్ రావల్సి ఉన్నాయని పాఠశాల సిబ్బంది తెలిపారు. ఇప్పటికీ ఏడు, ఎనిమిది తరగతుల పుస్తకాలు రాలేదు. వీటితో పాటు సాక్స్, బ్యాగ్స్, ఇతరత్ర ముడిసరకులు రావల్సి ఉన్నాయి. విద్యాసంవత్సరం సమీపిస్తుండంతో పూర్తిస్థాయిలో బుక్స్ అందుబాటులో ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా సత్యసాయి రథయాత్ర

ఏలేశ్వరం: సత్యసాయిబాబా రథానికి పట్టణంలో శుక్రవారం భక్తులు ఘనస్వాగతం పలికారు. ఈ మేరకు సత్యసాయి శతజయంతిని పురస్కరించుకుని వందరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా రథంతో ప్రచారం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా రథం పట్టణంలోకి రావడంతో భక్తులు స్వాగతం పలికారు. రథాన్ని పట్టణంలో పలుప్రాంతాల మీదుగా ఊరేగించి ప్రత్యేక పూజలు చేపట్టారు. సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు గోవిందు రాజులు, జయబాబు, మట్టే సుబ్బారావు, నేతి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: తుని నుంచి వచ్చిన శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథ యాత్రకు ప్రత్తిపాడులో అపూర్వ స్వాగతం లభించింది. శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎస్వీఎస్ సూర్యనారాయణ, సంఘ ప్రతినిధులు కొమ్ముల జయబాబు, జంధ్యం సాయిలక్ష్మి, మహేశ్వరరావు, ఎం.లక్ష్మణ్ కుమార్ తదితరులు రథానికి ఘన స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భజన నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. సస్థానిక సత్యసాయి సమాజంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణలో సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆధ్యాత్మిక విభాగం సమన్వయకర్త కస్తూరి భాస్కర్, శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తుని: పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11. గంటలకు చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ వెంకట్రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణాభివృద్ధికి సంబంధించి పొందుపరిచిన అంశాలపై చర్చించేందుకు కౌన్సిలర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

పారిశుధ్య పనులు మెరుగుపర్చాలి

తుని: పట్టణంలో పారిశుధ్య పనులను మెరుగుపర్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం 6వ వార్డులో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఖాళీ ప్రదేశాలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని, సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది వార్డుల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కౌన్సిలర్ సూరిశెట్టి సుభద్రాదేవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

12 మందికి శిక్ష

జగ్గంపేట: పట్టణ పోలీసు స్టేషన్ సర్కిల్ పరిధిలోని మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12మందిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారిలో కొంత మందికి కోర్టు జరిమానాలు, పలువురికి జైలు శిక్షలను న్యాయస్థానం విధించినట్లు జగ్గంపేట సీఐ వై.ఆర్.కె.శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జగ్గంపేట స్టేషన్ సర్కిల్ పరిధిలోని తరచు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఈ నేపథ్యంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారిలో నలుగురికి, ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా, ఎనిమిది మందికి మూడు రోజులు జైలు శిక్షను విధిస్తున్నట్లు పెద్దాపురం న్యాయస్థానం తీర్పు వెల్లడించిందని ఆయన మీడియాకు వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న నలుగురికి రూ.500 చొప్పున జరిమానా విధించినట్లు ఆయన వెల్లడించారు.

నేడు పింఛన్ల పంపిణీ

ప్రత్తిపాడు: మండలంలో శనివారం పింఛన్ల పంపిణీ చేయనున్నట్టు ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎం.వీ.ఆర్ కుమార్ బాబు శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. జూన్ 1వ తేదీ ఆదివారం శెలవు రోజు కావడంతో ఒక రోజు ముందుగానే పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలోని 23 సచివాలయల పరిధిలో 11,415 మంది పింఛన్ లబ్ధిదారులుండగా ఇందు కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు విడుదల చేసిందని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ మేరకు పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందితో కలసి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న భువన సుందరి

తుని: మైసూర్ దత్త పీఠం భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించిన అయినవిల్లి నమశ్రీ, ఇంటర్ ఫలితాల్లో 958/1000 మార్కులు వచ్చిన అయినవిల్లి గ్రీష్మలను మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అవార్డులతో సత్కరించారు. తెలుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శుక్రవారం జరిగిన అయినవిల్లి రాంబాబు, ఎండపల్లి గోవిందురాజులు తదితరులు పాల్గొన్నారు.

చేదును మిగిల్చిన తాండ్ర

- అకాల వర్షాలతో నష్టాల్లో తాండ్ర పరిశ్రమ
- నాడు కళకళ–నేడు వెలవెల
- ఉపాధి కూలీలు, నిర్వాహకులకు ఎదురుదెబ్బ
- గిట్టుబాటు కాని ధర



అకాల వర్షాలతో కొమ్మనాపల్లిలో ఖాళీగా దర్శనమిస్తున్న బట్టీలు



తాండ్ర తయారీకి మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు.

తొండంగి: వేసవి వచ్చిందంటే మామిడి తాండ్ర తయారీ కేంద్రాల్లో తాండ్రపోతతో కూలీలకు ఉపాధి పొందుతూ హడావిడిగా ఉండేది. కానీ అకాల వర్షాల కారణంగా మార్కెట్ ధర కూడా లేక పోవడంతో నేడు వెలవెలబోతున్నాయి.

ఉపాధికి నిలయాలుగా..

మండలంలో మెట్ట ప్రాంతాలైన రావికంపాడు, పి.ఇచిన్నాయపాలెం, ఏ.కొత్తపల్లి, శృంగవృక్షం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, బెండపూడి తదితర ప్రాంతాల్లో మామిడిని ఎక్కువగా సాగు చేస్తారు. మామిడి కాయల ఉత్పత్తి జరుగుతుండటంతో పి.ఇచిన్నాయపాలెం, ఏ.కొత్తపల్లి, కొమ్మనాపల్లిలో తాండ్ర తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో ఈ పరిశ్రమలు పెరిగాయి. మండలంలోనే ఈ గ్రామాలు అత్యధికంగా తాండ్ర తయారీకి ప్రసిద్ధిగాంచాయి. సుమారు 15 వరకూ నిర్వహకులు తయారీ కేంద్రాలు నెలకొల్పారు. కొందరు రైతులు, వ్యాపారులు సంయుక్తంగా మామిడి తోటలలోనే యంత్రసామాగ్రి ఏర్పాటు చేసి వివిధ ప్రక్రియల ద్వారా తాండ్రను తయారు చేస్తున్నారు.

తయారీ విధానం

ఒక్కో కేంద్రంలోనూ రోజుకి సుమారు 5 నుంచి 6 టన్నుల కాయలను తాండ్రకు వినియోగిస్తుంటారు. ముందుగా చెట్లనుంచి కోసిన కాయలను కోసి శుభ్రం చేసిన తర్వాత టెంకను వేరు చేస్తారు. అనంతరం వచ్చిన కాయల ముక్కలను పలుపు యంత్రంలో వేసి గుజ్జును తీస్తారు. గుజ్జును పాకంగా మార్చి, బెల్లంను గుండగా చేసి కలుపుతారు. అనంతరం ఎండలో వేసి బట్టీ చాపలపై పొరలుగా ప్రతీ పదినిమిషాలకు ఎండ తీవ్రతను బట్టి కూలీలు పొరలుగా పోస్తారు. టన్ను మామిడి కాయలకు సుమారు 3 క్వింటాల బెల్లం వినియోగిస్తుంటారు. రోజుకి సుమారు 13 క్వింటాల బెల్లం వినియోగం జరుగుతుంది. ఈ మొత్తం ప్రక్రియకు సుమారుగా 80 నుంచి 100 మంది కూలీలు నిత్యం పనిచేస్తుంటారు. మామిడి గుజ్జు, బెల్లం కలిసిన పాకం తయారీకి పురుషులు, చాపలపై పోత పోసేందుకు మహిళ కూలీలు పనిచేస్తుంటారు. వీటి ద్వారా పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు సుమారు వెయ్యి మందికి పైగా ప్రజలకు ఉపాధి లభిస్తుంది.

పెరుగుతున్న కూలీల రేట్లు

తాండ్ర తయారీ కేంద్రాల్లో ఒక్కొక్క మహిళకు రూ.300, పురుషుడుకి రూ.500 నుంచి రూ.600 వరకూ కూలీ చెల్లించేవారు. ఈ ఏడాది మహిళ కూలీలకు రూ.400, పురుషులకు రూ.700 వరకు వేతనాలు పెరిగాయి. ఒక్కోతయారీ కేంద్రం ద్వారా రోజుకు సగటున టన్నున్నర నుంచి రెండు టన్నుల వరకూ మామిడి తాండ్ర తయారవుతుంది.

ఉపాధికి దెబ్బ

వేసవిలో 50 నుంచి 60 రోజులపాటు మాత్రమే ఈ పని ఉంటుంది. వ్యవసాయ పనులు లేని వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాత్కాలికంగా ఉపాధి లభిస్తుంది. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్న మే నెలలోని దాదాపుగా 80శాతం తాండ్ర తయారీ జరుగుతుంది. కానీ ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అల్పపీడనం, ముందుగానే నైరుతి రుతుపవనాలు రాక తదితర కారణాలతో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో వర్షాలకు బట్టీలపై తాండ్రపోత పోసేందుకు వీలు లేక బట్టీలన్నీ ఖాళీగా వెలవెలబోతున్నాయి. రానున్నది వర్షాల కాలం కావడంతో మరో రెండు నెలలపాటు మూతపడనున్నాయి.

తగ్గిన గిరాకీ

తాండ్ర తయారీకి ముఖ్యంగా కలక్టరు రకం ఎక్కువగా వినియోగిస్తారు. ఈ ఏడాది మామిడి చెట్ల నుంచి కాయల దిగుబడి తగ్గడంతో వీటి ధర గతేడాది కంటే ఈ ఏడాది రెట్టింపైంది. టన్ను ధర గత ఏడాది రూ.13 వేల వరకూ ఉంటే ఈ ఏడాది రూ.20 వేల నుంచి 25 వేలుకు చేరింది. దీంతో అంతంత లాభాలతో నడిచే మామిడి తాండ్ర పరిశ్రమలు కాయల ధర పెరుగుదల కారణంగా వ్యాపారంలో డిమాండ్ తగ్గిందని వ్యాపారులు ఆందోళన చెందారు. కాయల ధర రెట్టింపైనప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు, నిర్వహణదారులు తయారీకి భారీగా పెట్టుబడి పెట్టారు. అనంతరం మార్కెట్లో మామిడి తాండ్ర ధర రూ.120కు పైగా ఉండగా ఒక్కసారిగా రూ.70 వరకూ పడిపోయింది. దీంతో పెట్టుబడి పెట్టినవారంతా నష్టాలబాట పట్టారు. ప్రస్తుతం ఈఏడాది కూడా తాండ్రకు మార్కెట్ లేకపోవడంతో పెరిగిన బెల్లం, కూలీల వేతన ధరలతోపాటు కరెంటు బిల్లులు, నిర్వహణ ఖర్చుల కారణంగా భారీ అప్పులు చేసి పెట్టుబడి పెట్టినప్పటికీ గిట్టుబాటు కావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని తాండ్ర తయారీ కేంద్రాల్లో ఉత్పత్తిని కూడా నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాలపై ఆధారపడిన కూలీలకు కూడా తాత్కాలిక ఉపాధికి గండిపడింది.

నిత్యం పని ఉండటం లేదు



ఈఏడాది వేసవిలో వర్షాలు కారణంగా తాండ్ర తయారీ కేంద్రాల్లో పని అంతంతమాత్రంగానే ఉంది. గతంలో నిత్యం పని ఉండటంతో ఉపాధికి ఇబ్బంది ఉండేది కాదు. ఈ ఏడాది వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో తాండ్ర తయారీకి అనుకూలంగా లేదు. కుక్కా నాగయ్యమ్మ, కూలీ, ఏ.వి.నగరం గ్రామం

అంతంత మాత్రంగానే ఉపాధి



వ్యవసాయపనులు అనంతరం వేసవిలో నిత్యం తాండ్ర తయారీ కేంద్రాల్లో పనికి వచ్చే వాళ్లం. దాదాపుగా రెండొందల మంది వరకూ ఉపాధి కలిగేది. ఈ ఏడాది మా ఉపాధికి వర్షాలు దెబ్బతీశాయి. తెరిపివ్వని కుండ పోత వర్షాలతో బట్టీల్లో పని తగ్గిపోయింది. వాతావరణం అనుకూలించినప్పుడు మాత్రమే పనులకు వస్తున్నాం.

– యాదాల నూకాలమ్మ, తాండ్ర తయారీ కూలీ, గోర్సపాలెం

గిరిజనుల అభ్యున్నతికి కృషి



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలిసిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: గిరిజనుల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో– ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. శుక్రవారం కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పార్టీ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం (పీఏసీ) నివాసంలోని రౌతులపూడి మండలం దిగువ శివాడ సర్పంచ్ కోరుప్రోలు దేవుడు, ప్రత్తిపాడు మండలం బవ్వరువాక, దోపర్తి గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా మండలాల్లోని రాజకీయ పరిస్థితులపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయంలో గిరిజన ప్రాంతాల ప్రజల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. త్వరలో గిరిజన ప్రాంతాలను పర్యటించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రామిశెట్టి నాని, గుర్రా కృష్ణ, శౌెట్టి కోదండ, కంచుకోట లక్ష్మీ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి ముద్రగడ పరామర్శ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు గ్రామానికి చెందిన జర్నలిస్టు రెడ్నం మురళి, వాసు సోదరులను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. మురళి తండ్రి గోవిందరావు ఇటీవల మృతి చెందారు. గోవిందరావు చిత్రపటానికి ముద్రగడ పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ మేరకు గోవిందరావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, సలాది కృష్ణ తదితరులున్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయం

తుని: సామాజిక సేవలో వాకర్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న అన్నారు. శుక్రవారం తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డీ.ఎస్.ఎన్.మూర్తి సమకూర్చిన మజ్జిగను రోగులకు పంపిణీ చేశారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వస్తున్న ప్రజలకు మజ్జిగ అందజేశామని పాస్ట్ గవర్నర్ చదరం శివాజీ అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, చాంబర ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

180 మందికి వైద్య పరీక్షలు..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి భారతి విద్యానికేతన్ ఆవరణలో స్థానిక చవలా ట్రస్ట్ జేపీఎస్ మినిట్రిస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 180 మందికి వైద్య సేవలు అందిచారు. శిబిరాన్ని శ్రీ భారతి విద్యానికేతన్ కరస్పాండెంట్ సుంకర వీరబాబు ప్రారంభించారు. వైద్యులు మౌనిక, మణికంఠ, భక్త ప్రదీప్ రోగులకు వైద్య సేవలను అందించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

యోగాంధ్ర ప్రచార ర్యాలీ



ఏలేశ్వరంలో యోగాంధ్రపై మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడు మహిళా సమాఖ్య కార్యాలయంలో యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు

ఏలేశ్వరం: యోగాంధ్ర ప్రచారంలో భాగంగా పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చాన్నారు. యోగాంధ్ర దిశగా అడుగులు వేయాలన్నారు. యోగా ఆధ్యాత్మిక శారీరక, మానసిక ఆరోగ్యం ఇస్తుందన్నారు. తొలుత ఎంపీడీఓ సూర్యనారాయణ అధ్యక్షతన ప్రచార ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కుశరాజు, మండల వ్యవసాధికారి బిజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన జీవనం

ప్రత్తిపాడు: ప్రతి రోజూ యోగా సాధనం చేయడం ద్వారా మెరుగైన జీవన విధానం అలవడుతుందని ఎంపీడీఓ కుమార్ బాబు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలికంగా వేధిస్తున్న మధుమేహం, బీపీ, థైరాయిడ్, వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు వంటి వాటికి ఉపశమనం లభిస్తుందన్నారు. నెల రోజుల పాటు తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ పాల్గొన్నాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు. యోగా శిక్షకులు దొడ్డిపట్ల సోమన్నదొర, అల్లూరి అంజనీదేవి సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ధ్యానంపై అవగాహన కల్పించి సాధన చేయించారు. గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీలకు యోగా శిక్షణ

జగ్గంపేట: జగ్గంపేట మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లుకు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగాపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో యోగా శిక్షణతో పాటు, అనంతరం గ్రామంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ దైనందిన జీవితంగా ఒక గంట సమయం యోగాకు కేటాయించాలన్నారు. ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

కిర్లంపూడి: యోగా మానసిక ఒత్తిడిని దూరం చేస్తుందని ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ తెలిపారు. స్థానిక సత్యదేవా కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, గ్రామ స్థాయిలో పనిచేస్తున్న వివిధ శాఖల సిబ్బందికి ట్రైనర్లు బావిశెట్టి లక్ష్మీనారాయణ, ఎస్.వెంకట రమణ పలు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీఓ సత్య ప్రసాద్, జేఏ యుఆర్‌బీ అచార్యులు పాల్గొన్నారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె



ప్రత్తిపాడులో సీఐటీయూ ఆవిర్భావ వేడుకలలో నాయకులు

ప్రత్తిపాడు: కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల కమిటీ సభ్యుడు కామేశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ 1970 మే 30న సీఐటీయూ ఏర్పడిన నాటి నుంచీ ఐక్యత–పోరాటం నినాదంతో నేటి వరకు కార్మికుల సమస్యలపై నిరంతర పోరు సల్పుతుందన్నారు. అలుపెరగని పోరాటం చేస్తున్న సీఐటీయూ పతాకం కింద లక్షలాది మంది కార్మికులున్నారన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని రొంగల ఈశ్వరరావు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె. కృష్ణ, అనంతలక్ష్మి, రమాదేవి, వెంకటలక్ష్మి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



తునిలో నిర్వహిస్తున్న వేడుకలు

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

తుని: కార్మిక, కర్షకల కోసం రాజీలేని పోరాటం చేస్తోన్న సీఐటీయూ పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని తుని శాఖ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తుని పట్టణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్మికులు ఐక్యతతో పని చేయాలని సూచించారు. గొర్ల వెంకటరమణ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బండి.. ఇక రాదండి..!

- ఇంటింటికీ రేషన్‌కు మంగళం
- రేపటి నుంచి రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ
- వాహన నిర్వాహకుల ఉపాధికి గండి
- కార్డు దారులకు తిప్పలు ప్రారంభం



ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్

ప్రత్తిపాడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇంటి ముంగిటకే రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. జూన్ 1వ తేదీ నుంచే పాత విధానంలోనే రేషన్ దుకాణాలకు వెళ్లి, క్యూ లైన్‌లో నిలుచుని సరుకులు తెచ్చుకోవాలని స్పష్టం చేసింది. దీనితో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కష్టాలు ఆరంభమయ్యాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ రద్దు చేయడంతో, లక్షల మందికి జీవనోపాధి పోయింది. ఇప్పుడు మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ) వాహన వ్యవస్థను రద్దు చేయడంతో వచ్చే నెల నుంచి రేషన్ వాహనాల డ్రైవర్ కం ఆపరేటర్, అసిస్టెంట్లు తమ జీవనోపాధిని కోల్పోతున్నారు. ఇంటికో వద్దకే అందిన రేషన్ సరకుల కోసం రేషన్ దుకాణాల వద్ద మళ్లీ క్యూ కట్టాల్సిందే. మండలంలోని బురదకోట, కె.మిర్తివాడ, బాపన్నధార, ఉలిగోగుల, సీముసురు తదితర తండా వాసులు కొండలు దిగి, ఎక్కాల్సిందే. దీంతో ఒకేసారి అటు కార్డుదారులను ఇబ్బందులకు గురి చేయడంతో కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న నిరుద్యోగుల పొట్టకొట్టింది.

అక్రమాలకు చెక్

ఇంటి ముంగిటకే లబ్ధిదారులకు ఎండీయూ వాహనాలతో సరుకులు ఇవ్వడం వల్ల అక్రమాలకు చెక్ పడినట్టయ్యింది. కార్డుదారులకు సైతం సమయం కలిసొచ్చి వ్యయ ప్రయాసలు తగ్గాయి. గతంలో రేషన్ దుకాణాలు తెరిచే సమయానికి పనులు మానుకొని అక్కడే వేచి ఉండేవారు. గత ప్రభుత్వంలో ఒకటో తేదీ నాటికే పింఛన్ మాదిరి సరుకులు ఇంటి సమీపానికే వచ్చి అందేవి. ఈ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేస్తున్నందున రేషన్ సరుకుల కోసం గంటలు, రోజులు తరబడి నిరీక్షించాల్సిందేనని, బియ్యం బరువును తలపై భరించాల్సిందేనంటూ కార్డుదారులు వాపోతున్నారు.

కష్టకాలంలోనూ ఆగని పంపిణీ

ఎండా వానలలోనే కాదు, కరోనా వంటి కష్టకాలంలోనూ రేషన్ పంపిణీ ఆగలేదు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఎండీయూ ద్వారా సరుకులు అందజేసేవారు. ఇప్పుడు పరిస్థితి చూస్తే అయోమయంగా మారింది. ఒక్కో రేషన్ వాహనానికి నెలకు రూ. 21 వేలు చొప్పున ప్రభుత్వం నుంచి అందజేసేవారు. రేషన్ వాహనాలకు 2027 వరకు ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం జూన్ 1 నుంచే ఇంటింటికీ రేషన్ పంపిణీకి గుడ్ బై చెప్పింది.

ఎండీయూ రద్దుతో

కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో మండలంలోని 19 మంది డ్రైవర్ కం ఆపరేటర్లు, 19 మంది అసిస్టెంట్ల ఉపాధికి గండి పడింది. వారి కుటుంబాలు రోడ్డున పడతాయి. ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని ఎండీయూ సిబ్బంది ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు.

ఇంటివద్దనే రేషన్ ఇవ్వాలి



రేషన్ సరుకుల కోసం పనులు మానుకొని, రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు పడేవాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వాహనంతో ఇంటి వద్దనే సరుకులు అందిస్తున్నారు. సౌకర్యవంతంగా ఉంది. ఇప్పుడు మళ్లీ రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– రాజాల ఏసురత్నం, లంపకలోవ, ప్రత్తిపాడు మండలం.

రోడ్డున పడతాం



ఎండీయూ వాహనాల్లో రేషన్ సరుకులు సరఫరా చేస్తూ, ఉపాధి పొందుతున్నాం. పేదలకు రేషన్ సరుకులు అవినీతికి తావులేకుండా అందిస్తుంటే సంతోషంగా ఉంది. బండి ద్వారా నెలకు వచ్చే రూ.10 వేల ఆదాయమే కుటుంబానికి ఆధారం. నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేయడం తగదు. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– మూరా కృపారావు, ఎండీయూ డ్రైవర్ కం ఆపరేటర్, ప్రత్తిపాడు

మళ్లీ పాత రోజులే

ప్రత్తిపాడు మండలంలోని గిరిజన తండాలైన బురదకోట, గోకవరం, తోటపల్లి కొండలు, బవ్వరువాక, వంతాడ గిరిజన తండాల్లో డీఆర్ డిపోలున్నాయి. వీటితో పాటు మండలంలో 42 రేషన్ డిపోలు వెరసి 47 రేషన్ డిపోలున్నాయి. మండలంలో 26,404 మంది కార్డుదారులున్నారు. వీరికి ప్రతీ నెలా 19 ఎండీయూ వాహనాల ద్వారా ఎండీయూ ఆపరేటర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్నారు. దుకాణాం పరిధి నుంచి ఒకటి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే ఆవాస గ్రామాల్లోని కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 2022వ సంవత్సరం నుంచి సరుకులు అందుతున్నాయి.

సాంకేతికతోనే రైతుల అభ్యున్నతి



కిర్లంపూడి రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న జేడీఏ విజయ్ కుమార్

కిర్లంపూడి: నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించి రైతులు మరింతగా అభ్యున్నతి చెందాలని కృషి విజ్ఞన పరిశోధన కేంద్రం (కలవచర్ల) శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.కే ప్రసాద్ అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాశాఖ అధికారి జోకా అమృత అధ్యక్షతన శుక్రవారం కిర్లంపూడి, ఎస్.తిమ్మాపురం, బూరుగుపూడి రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్.విజయ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నానో సాంకేతిక ఎరువుల స్టాల్స్‌ను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నరకాల పంటలతో పాటు మెరక వ్యవసాయంతో అపరాలు, చిరుధాన్యాల పంటలపై దృష్టి సారించాలన్నారు. డీడీఏ హరి, ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజీవ్, శాస్త్రవేత్తలు శ్యామల, మురళీధర్, వెటనరీ డాక్టర్ నాగేశ్వరరెడ్డి, వీఏఏలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: మండల కేంద్రం జగ్గంపేట గ్రామంలోని నెహ్రూ కాలనీ, టీచర్స్ కాలనీలో శనివారం ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని జగ్గంపేట విద్యుత్ డీఇ వీరభద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకవరం రోడ్డులోని 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.